క్లుప్తంగా

సామాజిక న్యాయం పాటించాలి

సఖినేటిపల్లి: రాజోలు నియోజకవర్గంలో త్వరలో జరుగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించాలని అప్పనరామునిలంక మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు తోటె ప్రతాప్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గంలోని 14 సంఘాలకు గాను 50 శాతం అధ్యక్షులను ఎస్సీ, బీసీలను ఎంపిక చేసి, సామాజిక న్యాయం చేయాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పలువురికి ఆర్థికసాయం



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న బుజ్జిరాజు తదితరులు

మలికిపురం: రాజోలు దీవిలో అనారోగ్యంతో ఉన్న పలువురికి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు సమకూర్చిన ఆర్థిక సాయాలను గురువారం మలికిపురంలోని వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు ఇంటి వద్ద జరిగిన ఒక కార్యక్రమంలో చెక్‌ల రూపేణా బాధితులకు అందించారు. పి.శేషప్రసాద్ (సఖినేటిపల్లిపాలెం) రూ.20 వేలు, ఆకుమర్తి శాంతికుమారి (అప్పనపల్లి) రూ.15 వేలు, గుంజె భద్రాచలం (సఖినేటిపల్లి), రూ.10 వేలు, కొల్లాబత్తుల రాంబాబు (అంతర్వేదికర) రూ.10 వేలు, ఉచ్చుల కామేశ్వరరావు (కేశవదాసుపాలెం) రూ.10 వేలు, షేక్ రంజానీ (మలికిపురం) రూ.10 వేలు, ముసూకుడి పెద్దిరాజు (లక్కవరం) రూ.10 వేలు, ముత్యాల దత్తాత్రేయ (శివకోటి) రూ.10 వేలు, చొప్పున మొత్తం రూ.95 వేలను సాయంగా అందించారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధి బోనం రాజు, అల్లూరి మధు రవిరామరాజు, స్టూడియో వర్మ, గిడుగు తాతాలు, అబ్బాస్, సుగుణ, ఆయా గ్రామాల్లోని పెద్దలు పాల్గొన్నారు. సాయం అందించిన దాత వెంకట రామరాజుకు అనారోగ్య బాధిత కుటుంబాల వారు కతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు ఐరన్ సిరప్ అందజేత



చింతలూరులో విద్యార్థులకు ఐరన్ సిరప్ డ్రాప్స్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనీమియా ముక్త భారత్‌లో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ డ్రాప్స్ అందజేశారు. ఎనీమియా నివారణకు ప్రతి గురువారం ఈ డ్రాప్స్ అందించనున్నట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడికుదురు: నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. నగరం కొత్త రోడ్ నుంచి జగ్గన్నపేట వరకు, జగ్గన్నపేట సెంటర్, మొగలికుదురు గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రావులపాలెంలో..

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఊబలంక, రావులపాలెంలోని డిగ్రీ కాలేజీ ఏరియా, అంకాలమ్మ గుడి ఏరియా, నక్షత్ర స్కూల్ ఏరియా, గంగదొడ్డి, శెట్టిబలిజ రామాలయం ఏరియా, వడ్డీల కాలనీ, సీఆర్‌సీ రోడ్డు, హైవే, మార్కెట్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గర్భకోశ వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

రావులపాలెం: పశువుల్లో గర్భకోశ వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీ ఉమామహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీపోలవరంలో మెగా పశువైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో గర్భకోశ నివారణ టీకాలను 52 పశువులకు ఉచితంగా వేశారు. అలాగే వివిధ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ఎం.సోమేశ్వర్ రెడ్డి, రావులపాలెం పశువైద్యాధికారి ఎం.సాయిభాస్కర్, సతీష్, పొడగట్లపల్లి పశువైద్యాధికారి తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాకు మంగళం

- బీమా ప్రీమియం రైతులే చెల్లించాలంటూ ఉత్తర్వులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంటలకు ఉచిత బీమా



మొసలపల్లిలో వరి పంటకు సిద్ధం చేసిన నారుమడి

అంబాజీపేట: అన్నదాతలు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట ప్రకృతి విపత్తుల వల్ల దెబ్బతింటే ప్రభుత్వం వారికి అండగా ఉంటూ ఆదుకోవాలి. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పనిచేస్తోంది. రైతులకు అండగా ఉండడం మాట అటుంచితే, రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ రైతులపై కక్ష సాధింపు చర్యల్లా ఉన్నాయని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ఉచిత పంట బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. వర్షాలు, తుపాన్లతో పంటకు నష్టం వాటిల్లినప్పుడు రైతులను ఆదుకునేందుకు దోహదపడుతుందనే ఉద్దేశంతోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019 ఖరీఫ్ సీజన్ నుంచే ఉచిత పంట బీమా పథకాన్ని ఈ-క్రాప్ నమోదు చేసి సాగు విస్తీర్ణం అంతటికీ బీమా వర్తించేలా ప్రభుత్వమే రైతుల తరఫున ప్రీమియం చెల్లించేది. రైతులపై ఒక్క రూపాయి కూడా భారం పడేది కాదు. బీమా ప్రీమియం చెల్లించేందుకు రైతులు ఆర్థిక ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండేది కాదు. పంటలకు నష్టం వాటిల్లితే తంచన్‌గా పరిహారం అందేది. నియోజకవర్గంలో 2021 ఖరీఫ్ సీజన్లో తుపాన్ ప్రభావంతో పంటలు దెబ్బతినగా వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకం కింద వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిహారం అందించింది. పి.గన్నవరం నియోజకవర్గంలో 25,832, కొత్తపేట నియోజకవర్గంలో 34,702, రాజోలు నియోజకవర్గంలో 8,650 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

రైతన్నల ఆవేదన

చంద్రబాబు ప్రభుత్వం ఉచిత పంటల బీమా రద్దు చేయడంతో ప్రీమియం భారం రైతులపై పడుతోంది. రబీ సీజన్‌కు సంబంధించి పంట బీమా కోసం రైతులే ప్రీమియం సొమ్ము చెల్లించాలంటూ ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. పంటల బీమా ప్రీమియం చెల్లింపులు రైతులే చేయాలని ప్రభుత్వం నిర్ణయం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ప్రభుత్వమే రైతుల తరఫున సంబంధిత బీమా సంస్థలకు ప్రీమియం చెల్లించాలని కోరుతున్నారు. రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం కూడా ప్రభుత్వం ఇంకా అందించలేదని, అప్పులు చేసి పంట సాగు చేస్తున్నామని ఇప్పుడు బీమా పథకాన్ని కూడా నీరుగార్చితే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

సమంజసం కాదు



పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి. గతంలో అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలి. ప్రభుత్వం రైతులపై భారం మోపడం సమంజసం కాదు. పెట్టుబడికే డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే బీమా చెల్లించాలని అనడం అన్యాయం. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందజేయాలి.

– కె.ఆనంద వెంకటప్రసాద్, రైతు సంఘం అధ్యక్షుడు, పుల్లేటికుర్రు

ప్రీమియం చెల్లించాలి



రబీ పంటకు సంబంధించి ఎకరాకి రూ.630 బీమా ప్రీమియం చెల్లించాలి. రూ.42 వేలకు బీమా వర్తిస్తుంది. కామన్ సర్వీస్ సెంటర్లలో రైతుకు సంబంధించిన వివరాలను నమోదు చేసి ప్రీమియం చెల్లించాలి. బీమా చెల్లించిన వారికి మాత్రమే పంట నష్ట పరిహారం అందుతుంది. ప్రతి రైతు తప్పనిసరిగా ప్రీమియం చెల్లించాల్సిందే.

– సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఏవో, అంబాజీపేట

బాధిత కుటుంబానికి పరామర్శ



పోతవరంలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

పి.గన్నవరం: మండలంలోని చింతావారిపేట వద్ద ఇటీవల పంట కాలువలోకి కారు దూసుకుపోయిన ప్రమాదంలో భార్య, ఇద్దరు కుమారులను కోల్పోయిన బాధితుడు నేలపూడి విజయకుమార్‌ను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు గురువారం పరామర్శించారు. బాధితుడిని ఓదార్చారు. సర్పంచ్‌లు వడలి కొండయ్య, కొంబత్తుల ఏసుబాబు, మండలపార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, అడ్డగళ్ల వెంకట సాయిరామ్, యన్నాబత్తుల ఆనంద్, కొక్కిరి రవికుమార్, సాధనాల రమేష్, దొమ్మేటి దుర్గారావు, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, దూనబోయిన రవిచంద్ర తదితరులు విజయకుమార్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు.

విద్యుత్ కార్మిక సంఘంలో కార్మికుల చేరిక

ఆలమూరు: రామచంద్రపురం డివిజన్‌లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పలువురు కార్మికులు తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘంలో చేరారు. ఆలమూరులోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో డివిజన్ డిస్కం కార్యదర్శి బొబ్బా రవీంద్ర, జిల్లా సంఘ నేతలు గొడవర్తి సురేష్, ఎ.భాస్కరరావు, వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని షిఫ్ట్ ఆపరేటర్లు, లైన్‌మన్లు, ఇతర సిబ్బంది యూనియన్ చేరిన వారిలో ఉన్నారు.

టైలర్ ఏఎస్ఎన్ మృతి



టైలర్ ఏఎస్ఎన్(ఫైల్)

పి.గన్నవరం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వ్యాప్తంగా పేరొందిన ఊడిమూడి గ్రామానికి చెందిన ప్రముఖ టైలర్ అయినంచిన సత్యనారాయణ (72) (ఏఎస్ఎన్ టైలర్)గురువారం మృతి చెందారు. ఆయన గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గత 45 ఏళ్లుగా ఆయన టైలర్‌గా పనిచేస్తూ వందలాది మందికి టైలరింగ్ నేర్పి జీవనోపాధికి మార్గం చూపారు. ఉభయగోదావరి జిల్లాల్లో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రముఖులు, అధికారులు ఏఎస్ఎన్ వద్ద దుస్తులు కుట్టించుకుంటారు. సత్యనారాయణకు ఇద్దరు కుమారులు పాండురంగ విఠల్, సీతారామ్‌లు కూడా టైలర్లుగా రాణిస్తున్నారు. ఆయన మృతికి పలువురు రాజకీయ నాయకులు, అధికారులు, గ్రామస్తులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ



మలికిపురంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



పి.గన్నవరంలో పోస్టర్ విడుదల చేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

మలికిపురం: అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ నిలుస్తుందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు అమలాపురం జిల్లా కలెక్టర్‌కు రైతు సమస్యలపై ఈనెల 13న ఉదయం 9 గంటలకు నల్లవంతెన దగ్గర నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరి వినతిపత్రం అందజేయుటకు జిల్లా అధ్యక్షులు 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మలికిపురం పార్టీ కార్యాలయంలో ఈ మేరకు కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి మాజీ మంత్రులు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, జిల్లా పార్టీ నాయకులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మునిసిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ పదవుల్లో ఉన్న నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుసుమ చంద్రశేఖర్, కారుపర్తి భాస్కరరావు, తాడి సహదేవ్, అడబాల జానకీ రామ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతుగా..

పి.గన్నవరం: రైతన్నలను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం ఉదయం 9 గంటలకు అమలాపురం కలెక్టరేట్ వద్ద జరుగనున్న ర్యాలీ, విజ్ఞాపనా పత్రం అందజేత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. దీనికి సంబంధించి పోస్టర్లను గురువారం పి.గన్నవరంలోని తన కార్యాలయం వద్ద విప్పర్తి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నిరసన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, రైతులు అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పెట్టుబడి సాయంగా రైతులకు కూటమి ప్రభుత్వం ఇస్తానన్న ఏడాదికి రూ.20 వేలను తక్షణమే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని, ధాన్యం కొనుగోళ్లలో దళారీ వ్యవస్థను తొలగించాలని, తడిసిన రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తేమ లెక్కలతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలని, ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని విప్పర్తి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, అడ్డగళ్ల వెంకట సాయిరామ్, యన్నాబత్తుల ఆనంద్, కొంబత్తుల ఏసు, సాధనాల రమేష్, దొమ్మేటి దుర్గారావు, నూకపెయ్యి రాజేంద్ర ప్రసాద్, దూనబోయిన రవిచంద్ర, కొక్కిరి రవికుమార్ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏటిగట్టు దారిని అభివృద్ధి చేయాలి



శానపల్లిలంకలో పాడైన ఏటిగట్టు దారి

అయినవిల్లి: మండలంలోని మడుపల్లిలంక నుంచి కొండుకుదురు వరకూ 15 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఏటిగట్టు రహదారిని అభివృద్ధి చేయాలని లంక గ్రామాల రైతులు కోరుతున్నారు. ఈ రహదారి మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఈ రహదారిని పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ఈ రహదారి గుంతలు పడి పాడైంది. చిన్నపాటి వర్షానికో చిత్తడిగా మారుతోంది. ఈ రహదారిపై లంక గ్రామాల్లో పండిన వ్యవసాయ సంబంధ ఉత్పత్తులు తరలించేందుకు ఉపయోగపడుతుంది. మండలంలో ఏటిగట్టుకు ఆనుకుని మడుపల్లిలంక, చింతనలంక, అయినవిల్లి, శానపల్లిలంక, కొండుకుదురులంక తదితర గ్రామాలు ఉన్నాయి. సుమారుగా పదివేల మంది రైతులు ఈ రహదారిపై రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఈ లంక గ్రామాల్లో వ్యవసాయ ఉత్పత్తులు ఈ రహదారి ద్వారానే తరలించాలి. ఇటువంటి ఉపయోగంలో ఉన్న రహదారి 18 ఏళ్లుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఈ రహదారిని అభివృద్ధి చేస్తే రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వం తమ గోడును పట్టించుకోవాలని కోరుతున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతకు స్వామి చిత్రపటం ఇస్తున్న అర్చకులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అమలాపురానికి చెందిన యనమదల లక్ష్మీసంధ్య, ఆమె కుటుంబ సభ్యులు గురువారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ అర్చక, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా విఘ్నేశ్వరస్వామివారి 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించనున్నట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం

- పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు
- వినతిపత్రాలు స్వీకరించిన అధికారులు



కె.పెదపూడిలో కాలనీల్లో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి



శానపల్లిలంక రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న సీహెచ్ నాగలక్ష్మమ్మ



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్



మోరిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

అయినవిల్లి: రెవెన్యూ సదస్సులో భాగంగా వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని స్థానిక తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ తెలిపారు. శానపల్లిలంక గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సును నిర్వహించారు. మొత్తం 16 అర్జీలు రాగా వాటిలో 11 మ్యుటేషన్స్, ఒకటి సర్వే, ఈ-పాస్‌బుక్‌ల కోసం రెండు, అండగల్ కరెక్షన్‌కు మూడు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు హాజరయ్యారు.

మోరిలో..

సఖినేటిపల్లి: మండలంలోని మోరి పంచాయతీ వద్ద గురువారం తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ పస లపూడి లక్ష్మీపద్మ మంగతాయారు అధ్యక్షతన జరిగిన సదస్సులో తహసీల్దార్ మాట్లాడుతూ, రైతుల భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికై సదస్సు ఏర్పాటు చేశామన్నారు. భూములకు సంబంధించి పలు అంశాలపై అధికారులు వినతిపత్రాలు తీసుకున్నారు. డీటీ సీహెచ్ భాస్కర్, సర్వేయర్ భద్రరాజు, వీఆర్వోలు రమ్య, దుర్గ, వీఆర్ఏ గోపాలకృష్ణ, ఎండోమెంట్స్, సబ్‌రిజిస్ట్రార్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. గురువారం పొన్నమండలో సర్పంచ్ కుక్కల బేబికుమారి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తుందన్నారు. కేవలం రెవెన్యూ పరమైన సమస్యలే కాకుండా ఇతర సమస్యలపై కూడా దరఖాస్తులను అధికారులకు అందించవచ్చన్నారు. వివిధ సమస్యలపై 186 దరఖాస్తులను స్వీకరించామన్నారు.

రోడ్డు నిర్మించండి

అంబాజీపేట: కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా నేటికి రహదారులు నిర్మించుకునేందుకు చెట్లు అడ్డుగా ఉన్నాయని వాటిని తొలగించి రోడ్లు వేయించాలని కృష్ణదేవరాయుడు, మేనకేశ్వరస్వామి కాలనీ వాసులు కోరారు. కె.పెదపూడిలో రెవెన్యూ గ్రామ సభ గురువారం జరిగింది. గ్రామంలో తహసీల్దార్ పర్యటించి భూములకు సంబంధించి ఇబ్బందులు ఉంటే చెప్పాలని ప్రజలను కోరారు. రహదారిలో చెట్లు అడ్డుగా ఉండటం వల్ల గృహాలు నిర్మించుకునే వారికి, వ్యవసాయోత్పత్తులు తరలించేవారికి, వాహనదారులకు ఇబ్బందులకు గురవుతున్నారని తహసీల్దార్ జె.వెంకటేశ్వరికి వివరించారు. అలాగే డ్రైనేజీ సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీల్లో విద్యుత్ సౌకర్యం లేక నానాఅవస్థలు పడుతున్నామని తహసీల్దార్ వద్ద వాపోయారు. భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని వీటి ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 27 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి బి.అప్పారావు, వీఆర్వోలు పీబీ రమణ, ఎండోమెంట్ అధికారి ఎ.పెద్దింటిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీస్తు సందేశం విశ్వశాంతికి ప్రతీక

మామిడికుదురు: ఏసుక్రీస్తు సందేశం విశ్వశాంతి, సేవా భావాలకు ప్రతీక అని రెవరెండ్ ప్రభుదాస్ పేర్కొన్నారు. మామిడికుదురు మహిమ స్వస్థత పర్ణశాలలో గురువారం క్రిస్మస్ ఆరాధన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆధ్వర్యం వహించిన ప్రభుదాస్ మాట్లాడుతూ క్రీస్తు జనన సౌందర్యం, త్యాగం, ప్రేమను ప్రతిపాదిస్తూ క్రీస్తు సందేశం అందించారు. రెవరెండ్ మలాకితో పాలు పలువురు వక్తలు పాల్గొన్నారు. క్రైస్తవులు ఏసుక్రీస్తు గీతాలను ఆలపించారు. ఆరాధనలో విశ్వాసులు విశేష సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



అప్పనపల్లి దేవస్థానం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి దేవస్థానం న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం ఆవిష్కరించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. అనంతరం దేవస్థానం తరఫున ముద్రించిన 2025 న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో వర్ధిల్లాలని అభిలషించారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో జరిగిన ఆవిష్కరణలో కూటమి నేతలు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



సునీల్ దంపతులను సత్కరిస్తున్న వీరవల్లిపాలెం పీహెచ్‌సీ సిబ్బంది

అయినవిల్లి: ప్రజలకు విశేష సేవలు అందించిన వ్యక్తులకే గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ సగన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని వీరవల్లిపాలెం పీహెచ్‌లో పనిచేసి బదిలీపై కాకినాడ వెళ్లిన పీహెచ్‌సీ వైద్యులు ఎన్.సునీల్ దంపతులకు ఏర్పాటు చేసి వీడ్కోలు సభలో ముఖ్య అతిథులుగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడారు. అనంతరం ఎన్.సునీల్‌ను ప్రస్తుత పీహెచ్‌సీ వైద్యుడు పి.విజయ్, ఎ.లక్ష్మీసౌజన్య, పీహెచ్‌సీ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సలాది బుచ్చిరాజు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

నీటి సంఘం ఎన్నికలపై సమీక్ష

ఆలమూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాగునీటి సంఘ ఎన్నికలపై సమీక్ష జరిగింది. ఎంపీడీఓ ఎ.రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు పాల్గొని సాగునీటి ఎన్నికల వివరాలను సమగ్రంగా వివరించారు. ఈనెల 14న జరగబోయే నీటి సంఘం ఎన్నికలకు అన్ని శాఖల అధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. మండలంలో నాలుగు నీటి సంఘాలకు, ఒక డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌కు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇందులో మడికి, చొప్పెల్ల, ఆలమూరు, చింతలూరు నీటి సంఘాలు ఉన్నాయన్నారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ఎం.మెహర్ ప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పి.పద్మ, ఇరిగేషన్ శాఖ జేఈ టి.కృష్ణమూర్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకులు

రాజోలు: వేగంగా ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. గురువారం సోంపల్లి పుష్కరఘాట్‌కు సమీపాన ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరుకి చెందిన కె.బాబి తీవ్రంగా గాయపడ్డాడు. పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లి గ్రామానికి చెందిన పితాని వరుణ్ ఎడమచెయ్యి విరిగిపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజేష్‌కుమార్ తెలిపారు.